శ్రమదానంతో పాఠశాల మరమ్మతు పనులు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని భీమసింగి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితిపై గ్రామస్థులు తమ ఆవేదనను కేవలం మాటలకే పరిమితం చేయలేదు. సుమారు 35 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ పాఠశాల భవనాల పైకప్పులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో తమ పిల్లల భద్రతకు గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, తమ సొంత ఖర్చులతో, శ్రమదానంతో పాఠశాల శిథిలమైన పాత రేకులను తొలగించి, వాటి స్థానంలో కొత్త రేకులను ఏర్పాటు చేశారు. తక్షణమే పూర్తి స్థాయి మరమ్మత్తులు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతులు చేపడుతున్న గ్రామస్తులు

అన్నదాత సుఖీభవతో రైతులకు ఆసరా

-కలెక్టర్ దినేష్ కుమార్- జిల్లాలో 1,44,222 మందికి నగదు జమ

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రైతులు పండించే పంటలకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ - పియం. కిసాన్ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. శనివారం వ్యవసాయ శాఖ నిర్వహించిన అన్నదాత సుఖీభవ - పియం కిసాన్ పథకాన్ని ప్రకాశం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. కార్యక్రమాన్ని ఐటిడిఎ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జెసి, ఐటిడిఎ ఇన్చార్జి పిఒ ఎంజె అభిషేక్ గౌడ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్, టిడిపి పాడేరు ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి, ఏపి టూరిజం డైరెక్టర్ కిల్లో రమేష్ నాయుడు, జనసేన అరకు పార్లమెంట్ ఇంచార్జ్ వి.గంగులయ్య, పాడేరు జెడ్పిటిసి గాయత్రీ దేవి, ఎఎంసి చైర్మన్ ఎం.మంగతల్లి , ఎఎంసి డైరెక్టర్ ఎస్.నాగబ్బాయి, సర్పంచ్‌లు ఉషారాణి, పాండు తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ - పియం కిసాన్ పథకం కింద ప్రతి రైతుకూ రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. 2025-26లో తొలి విడతగా రూ.7 వేలు చొప్పున ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 1 లక్షా 44 వేల 222 మంది గిరిజన రైతులకు ఒకొక్కరికి రూ.7 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం జమ చేయడం జరిగిందన్నారు. అరకు నియోజకవర్గంలో 54,975 మందికి, పాడేరు నియోజకవర్గంలో 48,057 మందికి, రంపచోడవరం నియోజకవర్గంలో 40,057 మంది రైతులకు అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం జమచేయడం జరిగిందన్నారు. రైతులకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం 3 విడతలుగా ఈ పథకం లబ్ది దారులకు అందజేయడం జరుగుతుందన్నారు. కౌలు రైతులకు అక్టోబర్ లో అందజేయడం జరుగుతుందన్నారు. పథకం డబ్బులు జమకాని లబ్దిదారులు ఆందోళనక చెందాల్సిన అవసరం లేదని, 155251 టోల్ ఫ్రీ నెంబర్ కి తెలియ జేయాలన్నారు. ఆధార్ నెంబర్ నమోదు సమస్యలు ఉన్నందువలన కొందరికి డబ్బులు జామ జరగలేదని, లబ్దిదారులు సచివాలయంలో సరిచేసుకుంటే వెంటనే మీ ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. ఆగష్టు మొదటి వారంలో రైతు సదస్సులు నిర్వహణకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరిచాలన్నారు. అన్నదాత సుఖీభవ - పియం కిసాన్ పథకం చెక్కును లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బిఎస్ నంద్ పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న సురేంద్ర

గిరిజనులకు శతశాతం ఉద్యోగాలు కల్పించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- హుకుంపేట: ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని చేయాలని ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని గిరిజన సంఘ కార్యాలయంలో శనివారం జెండాను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి టీ.కృష్ణారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, ఆదివాసీల హక్కులు, భద్రత కోసం తీసుకొచ్చిన 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. వీటి పరిరక్షణకు ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో వందశాతం ఉద్యోగాలు కల్పించి, ఉపాధ్యాయ నియామకాలు స్థానిక ఆదివాసులకే ఇవ్వాలన్నారు. దీనికోసం ప్రత్యేక నియామక చట్టం తేవాలని డిమాండ్ చేశారు.మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టులను మినహాయించి, ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంఘ కార్యదర్శి ఎస్. హైమావతి, సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్. కొండలరావు, సంఘ నాయకులు కె. ఆనంద్‌కుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బళ్లారి రాఘవ జయంతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బళ్ళారి రాఘవ నాటక రంగానికి విశేష సేవలు అందించారని జెసి, ఐటిడిఎ ఇంచార్జీ పిఒ ఎంజె అభిషేక్ గౌడ అన్నారు. ఐటిడిఎలో శనివారం బళ్ళారి రాఘవ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బళ్ళారి రాఘవ చిత్ర పఠానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బళ్ళారి రాఘవ నాటక రంగంలో సంచలనాలు సృష్టించి సినిమా రంగం వైపు వెళ్ళిన గొప్పనటులన్నారు. కళా రంగానికి వీరూ చేసిన సేవలకు గుర్తింపుగా 1981 లో తపాలా బిళ్ళను విడుదల చేసారన్నారు. మొట్ట మొదటి సారిగా తెలుగు సినీ పరిశ్రమకు బళ్ళారి నుంచి బళ్ళారి రాఘవకు ఈ గౌరవం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ కుమార్, ఎఒ హేమలత, మేనేజర్ పరంజ్యోతి పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న జెసి

ఆదివాసీల హక్కులు, మనుగడ కోసం పోరాటం

పలుచోట్ల ఆదివాసీ గిరిజన సంఘం జెండా ఆవిష్కరణలు

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడుస్తున్న తరుణంలో ఆదివాసీలంతా ఏకమై హక్కుల కోసం, ఆదివాసీల మనుగడ కోసం భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీరామగిరి గ్రామపంచాయతీ పరిధి చొక్కానపల్లి గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జెండాను చొక్కనపల్లి గ్రామ పెద్ద తోడం గంగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ 2025లో ప్రభుత్వ నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో పోస్టులను 100కు 100శాతం స్థానిక ఆదివాసీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని, అందుకోసం జిఒ 3ను పునరుద్ధరించాలని, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో 1/70, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కూనవరంలో జరుగు కోయత్తోర్ పండూమ్ దక్కట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు కారం సుందరయ్య, కారం బొజ్జి, ఆత్మకూరి కాంతారావు, కారం సత్తిబాబు, సారా పాండు రాజు బొప్పెన రాజు, గొంది ధారయ్య, తోడం రాజు, తోడం అనిల్, తోడం రవి, సున్నం సీతమ్మ, పూజారి మంగమ్మ, బూబమ్మ, పీసా కమిటీ కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం మండలం చొక్కనాపల్లిలో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న నాయకులు, స్థానికులు

కోయత్తోర్ పండుం దక్కట్‌ను విజయవంతం చేయండి

కూనవరం : మండలంలోని అభిచర్ల గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం జెండాను తెల్లం తమ్మయ్య శనివారం ఆవిష్కరించారు. అనంతరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ ఈనెల ఆగస్టు 9న కూనవరంలో జరిగే నాలుగు మండలాల ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని, కోయ్‌తోర్ పండుం దక్కట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొమరం భీం, బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు ఇలా అనేకమంది ఆదివాసీల కోసం చేసిన పోరాటాలు ఫలితంగా నేడు ఆదవాసీలకు చట్టాలు హక్కులు కల్పించబడ్డాయని తెలిపారు. గిరిజనులంతా మమేకమై ఈ చట్టాలను హక్కులను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సీతారామయ్య, బాబు బోర్రయ్య, రవ్వ ప్రసాదు, కారం రాముడు, పాయం జ్యోతి, ఎంపిటిసి ధర్మల అమ్మాజీ, సర్పంచ్ నాగమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ సాంస్కృతిపై అవగాహనా సదస్సు

చింతూరు : ఆదివాసీ వారోత్సవంలో భాగంగా శనివారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ సంస్కృతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కల్లేరు పంచాయితీ నాయకులు పొడియం జానీ మాట్లాడుతూ భాష, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, జీవనశైలి ఇవన్నీ కూడా ఆదివాసీ సంస్కృతిలో భాగమని తెలిపారు. వాటిని కోల్పోతే ఆదివాసీ అస్తిత్వం కోల్పోయినట్లేనని పేర్కొన్నారు. జాతి మనుగడ కోసం ఆదివాసి సాంస్కృతిక పండుగలు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు మరిచిపోకూడదని పేర్కొన్నారు. నేడు ఆదివాసీలు పరమతాన్ని ఆచరించినట్లు, పర భాష మాట్లాడినట్లు ఆదివాసి భాషను మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కూడా ఇతర మత సంస్కృతులను ఆదివాసీలపై రద్దుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంద్రుమ్ రాజులు, జోగారావు, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం మండలం అభిచర్ల గ్రామంలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

చింతూరు మండలం కల్లేరులో...

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

-ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఏ వద్ద ఫ్యాప్టో ఏఎస్సార్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్యాప్టో చైర్మన్ రావుల.జగన్ మోహన రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుండి విముక్తి కలిగించాలని, ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు లేదనే నెపంతో రెండు నెలలు గా జీతాలు చెల్లించ లేదన్నారు. 2023వ సంవత్సరము జులై నెలలో ఇవ్వాల్సిన పిఆర్సిని ఇప్పటి వరకు ఇవ్వలేదని, ఇప్పటి వరకు 3 డిఏ లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. 2025 మే నెలలో బదిలీ జరిగి నేటి వరకు కూడా రిలీవ్ కానీ ఉపాధ్యాయులకు వారు కోరుకున్న పాఠశాలకు పంపించేందుకు చర్యలు తీసుకుని ఉమ్మడి సర్వీస్ తీసుకు వచ్చి కామన్ సీనియారిటీ ప్రాతిపాదికన ప్రమోషన్ కల్పించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలన్నారు. 70 సంవత్సరాల నిండిన పెన్షనర్‌కు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ఇవ్వాలని, సుమారు 18 డిమాండ్లు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు రెప్రజెంటేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో అల్లూరి సీతారామరాజు జిల్లా సెక్రటరీ జనరల్ ముఖి. రామకృష్ణ, కోశాధికారి వి.మహేష్, కో కార్యదర్శి కె. శేషగిరి, కర్రన్న, మాజీ గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పలాసి. కృష్ణారావు, ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రేగం.సూర్యనారాయణ, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ముఖి. శేషాద్రి పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

తుప్పలు తొలగిస్తూ గిరిజనుల నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేసి నిలిచిపోయిన బలగరువు రోడ్డు పనులు తక్షణమే పున్హ ప్రారంభించాలని సిపిఎం, పివిటీజీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం బలగరువు-మద్రేబు గ్రామాల రోడ్డు దారిలో తుప్పలను తొలగిస్తూ వినుత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, పివిటిజి గిరిజన సంఘం నాయకులు ఎస్. రమేష్, కె. సోమన్నలు మాట్లాడుతూ, పిన్నకోట- పెద్దకోట, జీనపాడు పంచాయతీ పరిధి గ్రామాలు బలగరువు, మద్రేబు, దాయర్తి. తోపాటు ఎనిమిది గ్రామాలకు లింక్ రోడ్డు నిర్మాణానికి పీఎం జన్మ్ పథకం కింద 11 కోట్ల 63 లక్షలతో రోడ్డు నిర్మాణానికి జనవరి నెలలో ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని తెలిపారు. నేటి వరకు పనులు మొదలు పెట్టలేదన్నారు. రోడ్డు పనులు చేపట్టాలని లేకుంటే ఆదివాసి దినోత్సవం రోజున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తుప్పలు తొలగిస్తున్న గిరిజనులు



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఇఒ

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అరమ పంచాయతీ పూలుగుడ ఎంపీపీ పాఠశాలను శనివారం మండల విద్యాశాఖ అధికారి ఎస్ సుందర్రావు సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్నం పెట్టిన భోజనాన్ని, పాఠశాల రికార్డులను విద్యార్థులకు బోధిస్తున్న బోధన తీరుపై అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ బాబు, ఎం శ్రీను పాల్గొన్నారు.

సెర్ప్ డైరెక్టర్ చక్రవర్తి పర్యటన

ప్రజాశక్తి-అరకులోయ: మహిళలు అడ్డా లీఫ్ ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చు అని సెర్ప్ డైరెక్టర్ చక్రవర్తి అన్నారు. శనివారం అరకులోయ సందర్శించిన ఆయన వందన్ వికాస్ కేంద్రంలో మహిళలు తయారు చేస్తున్న అడ్డా లీఫ్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఏ విదంగా తయారు చేస్తున్నారు. మార్కెటింగ్ ఎలా చేస్తారని అడిగి అడిగి తెలుసుకున్నారు. అనంతగిరి మండలంలో కాఫీ హబ్, డుంబ్రిగూడ మిల్లెట్స్ హబ్ కూడా సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి మురళి, వెలుగు ఏపీఎం ప్రసాద్, సీసీ లు ఆనంద్,శ్రీరామ్, మంగళన్న, వివోఏ లు పాల్గొన్నారు.

అడ్డా ఆకులను పరిశీలిస్తున్న డైరెక్టర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గంగవరం,

గంగవరం, రంపచోడవరం మండలాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. గంగవరం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గంగవరం -అడ్డతీగల జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గంగవరం గ్రామానికి చెందిన కురసం వెంకన్న దొర(25) అక్కడికక్కడే మృతి చెందగా, గంగవరం మండలం టేకుల గ్రామానికి చెందిన ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అలాగే గంగవరం పోలీస్ స్టేషన్ సమీపంలో మరో బైక్ ప్రమాదంలో కోరుకొండ ప్రాంతానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు. జాతీయ రహదారి వేసినప్పటి నుండి అతివేగం వలన అనేక ద్విచక్రవాహనాలు ఢీకొని పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారని ఎస్‌పి చెప్పారు.

గంగవరం జాతీయ రహదారిపై గాయపడిన మహిళ

రంపచోడవరం : బైకును వానను ఢీకొన్న ఘటనలో సంఘటనా స్థలంలోనే ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రంపచోడవరం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... రంపచోడవరం మండలం ఆనంపల్లి గ్రామానికి చెందిన సుధాకర్, మరో వ్యక్తి బైక్‌పై వెళ్తున్న రంపచోడవరం నుండి ఆనంపల్లి వెళ్తూ చీమకండి సమీపంలో మలుపు వద్ద ఒక వాహనాన్ని ఓవర్ ట్రాక్ చేసి వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను వారు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే సుధాకర్ మృతి చెందగా. మరొక వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రంపచోడవరం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

చీమకండి మలుపు వద్ద జరిగిన ప్రమాదం

కానిస్టేబుల్ ఫలితాల్లో మెరిసిన కూటూరు యువత

ప్రజాశక్తి-కూనవరం : ఏపీ ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో కూనవరం మండలం కూటూరు గ్రామానికి చెందిన ముగ్గురు అభ్యర్థులు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన సున్నం అశోక్, పాయం గిరి బాబు, సున్నం నిరోషలు కానిస్టేబుళ్లుగా అర్హత సాధించారు. ఒకే గ్రామం నుండి ముగ్గురు ఉద్యోగాలు సాధించడం పట్ల కూటూరు గ్రామస్తులు, యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య అభ్యర్థులను కలిసి స్వీట్ తినిపించి వారికి అభినందనలు తెలియజేసారు. కృషి, పట్టుదలతో ప్రయత్నించి విజయం సాధించిన వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య స్థానిక సర్పంచ్ బొగ్గా వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లగా ఎంపికైన సున్నం నిరోష, పాయం గిరిబాబు, సున్నం అశోక్

పరిసరాల పరిశుభ్రతపై కళా జాతా

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని మారుమూల బూదరాళ్ల గ్రామ పంచాయితీ కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ - ఆరోగ్య విషయాలపై సామర్లకోట వారిచే కళా జాతా బృందం అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, అంటువ్యాధులు, ఇళ్ల వద్ద చెత్త సేకరణ, తడి-పొడి చెత్త వేరు చేయుట, వ్యక్తగత మరుగుదొడ్ల నిర్మాణం, బాల్య వివాహాలు అరికట్టుట, గంజాయి నిర్మూలన వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సాగిన ముత్యాలమ్మ, వార్డ్ సభ్యులు సంజీవ్, పంచాయితీ సెక్రెటరీ లీలా కృష్ణ, డిజిటల్ అసిస్టెంట్ బాబురావు, కూటమి నాయకులు కె కొండబాబు, కె చందరావు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

'అన్నదాత సుఖీభవ' ప్రారంభంలో ప్రభుత్వ విప్ గణబాబు

అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు, చిత్రంలో దొన్ను దొర

ప్రజాశక్తి-యంత్రాంగం

అరకులోయ:రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందని ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. శనివారం అరకు చేసిన ఆయన స్థానిక మండల పరిషత్ మందిరంలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమాన్ని అరకులోయ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో 54,975 మంది రైతులు అన్నదాత సుఖీభవ పొందుతుండగా, ఇందులో అరకులోయ మండలం నుంచి 8933, నుంచి 8207, డుమురిగుడ మండలం నుంచి 9605, హుకుంపేట మండలం నుంచి 11 294, పెదబయలు మండలం 9469, ముత్యం గుట్టు మండలం నుంచి 7467 ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నట్లు ఆయన తెలిపారు.అరకు నియోజకవర్గ ఇన్చార్జి ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియారి దొన్నుదొర మాట్లాడుతూ, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ అన్నదాత సుఖీభవ నిధులను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేష్, అగ్రికల్చర్ ఏడి మోహన్ రావు, పెద్దలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, టిడిపి మండల అధ్యక్షుడు మహదేవ్, టిడిపి నాయకులు శెట్టి బాబురావు, వెంకటరావు, బాలుదొర, నాగరాజు, అమ్మన్న, నిర్మల, నీరజ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ :ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకంలో భాగంగా అన్నదాత సుఖీభవ పీఎం కిషన్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసిందని టిడిపి గుంటసీమ పంచాయతీ అధ్యక్షుడు ఎస్ జక్కయ్య, టి ఎన్ టి యు సి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి చెప్పారు. శనివారం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించడంతో గుంత సీమ పంచాయతీ కార్యాలయంలో, పోతంగి పంచాయతీ కార్యాలయంలో గిరి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఏడాదికి రూ 20 వేల రూపాయలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది అఖిల, గిరి రైతులు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే శిరీష దేవి విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' సమావేశం రంపచోడవరం ఏడిఏ శశి బిందు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ప్రతి రైతు ఖాతాలో తొలి విడతగా రూ.7,000 జమ చేస్తున్నాయని తెలిపారు. రంపచోడవరం డివిజన్ వ్యాప్తంగా 40,057 మంది రైతులకు రూ.2803.99 కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, కెవికె శాస్త్రవేత్తలు ఆర్.ప్రవీణ్ బాబు, కె.రాజేంద్ర ప్రసాద్, జడ్పీటీసీ పండా వెంకట లక్ష్మి, ఎంపీపీ శ్రీదేవి, అడ్డతీగల ఏడిఏ సావిత్రి, వ్యవసాయ అధికారులు కింటుకూరి లక్ష్మణరావు, విశ్వనాధ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్యదేవి, సుజాత, చక్రధర్, కూటమి నాయకులు స్వప్న కుమారి, మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి, అడబాల బాపిరాజు, పండా బాబీ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు ఐటిడిఎ సమావేశ మందిరంలో శనివారం ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ నిధులు చెక్కును రైతులకు అందజేయడం జరిగింది. చింతూరు ఐటిడిఎ పరిధిలోని నాలుగు మండలాల్లో 7832 మంది రైతులకు 5 కోట్ల 48 లక్షల 24 వేల రూపాయలు మంజూరైనట్లు చెప్పారు. ఈకేవైసీ చేయించుకోని వారు దగ్గర్లో ఉన్న పోస్ట్ ఆఫీసుకి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనార్ధన్ రావు, ఎంపీడీవో శ్రీనివాస్ దొర, ఎంఏఓ రత్నప్రభ, ఏఎస్ఓ పాల్గొన్నారు.

అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వరనాయుడు



రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి - జి.మాడుగుల: జి.మాడుగుల, గెమ్మెలి ఆసుపత్రులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి విశ్వేశ్వరనాయుడు తనిఖీ చేశారు. ముందుగా గెమ్మెలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పి.హెచ్.సిలో వార్డులను పరిశీలించారు. ఎపిడమిక్ సీజన్ కావడంతో అత్యవసర మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జి.మాడుగులను సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు.ఏయే గ్రామాల నుండి రోగులు అదికంగా వస్తున్నదీ తెలుసుకొని సంబందిత క్షేత్ర స్థాయ సిబ్బందితో చర్చించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న సుఖ ప్రసవాలు, మాతా శిశువులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాదికారులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పి.హెచ్.సిలో ఉన్న ప్రసూతి నిరీక్షణ కేంద్రంను పరిశీలించారు. వార్డులో ఉన్న గర్భవతులను, బాలింతలను పరామర్శించారు. హెడ్ క్వార్టర్ లో నివాసం ఉంటూ రోజువారి విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విధులపై ఆలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి వైద్యాధికారి పి.నారాయణరావు, అఖిల్ వెంకటేశులు, ఆరోగ్య విస్తరణ అధికారి జి.సింహాద్రి, ప్రకాశరావు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని 516 ఈ హైవే రోడ్డు అంత్రిగుడ సమీప మలుపులో పర్యాటక కారు డివైడర్ ను శనివారం ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు అయ్యింది అరకు అందాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు చాపరాయి జలవిహారిలో సందర్శించి తిరుగు ప్రయాణంలో అరకు చేరుకునే క్రమంలో ప్రమాదవశాత్తు డివైడర్ను ఢీకొంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో డివైడర్ను కారు బలంగా ఢీ కొట్టింది. విశాఖకు చెందిన నలుగురు పర్యాటకులు కారులో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది. బాధిత పర్యాటకులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో శనివారం వారపు సంతలో టీబీ ముక్త భారత్ అభియాన్‌పై అవగాహన కల్పించారు. ముందుగా క్షయ వ్యాధిపై బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగ్లా వైద్యులు సౌజన్య, చిట్టపులి భార్గవి మాట్లాడుతూ, రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరము, శరీర బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారు కపం పరీక్షలు చేయించుకోవాలన్నారు. కుటుంబ సభ్యులు కూడా లక్షణాలు లేకున్నా ఎక్స్-రే పరీక్షలు చేయించుకోవడం ద్వారా టీబీని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టబీ సూపర్వైజర్లు సదానందం, నగేష్ దొర, డీపీసీ రామరాజు, ధనరాజ్, పీఏచ్ఎన్ జానకమ్మ, హెచ్‌వీ పద్మజ, స్వప్న, శైలజ, రమ్య పాల్గొన్నారు.

భవిష్యత్తుపై దృష్టిసారించండి

ప్రజాశక్తి హుకుంపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్ పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది మాట్లాడుతూ, హుకుంపేట మండలంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల-2 ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించడం జరిగిందని వారు పేర్కొన్నారు. బాల్యవివాహాలు, గంజాయి మత్తు పదార్థాల జోలికి పోరాదని హెచ్చరించారు. ప్రభుత్వాలు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్ కలలను నెరవేర్చుకోవాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీకి సభ్యత్వ నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, కార్యదర్శి జి గౌరీ శంకర్రావు, కోశాధికారి పి సూర్యారావు, కార్యవర్గ సభ్యులు టి ప్రసాద్ నాయుడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె అప్పలకొండ, మీనా కుమారి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -హుకుంపేట:కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు సమరశీల పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మండల కార్యదర్శి, మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు అధ్యక్షతన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మిడ్ డే మీల్స్ కార్మికులు, సానిటరీ వర్కర్లు, హాస్టల్, లైజన్ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏ, వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, చట్టాలపై జరుగుతున్న ఉద్యమాలను మరింత బలపర్చాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సూడిపల్లి కొండలరావు, నాయకులు కొండమ్మ, రాధిక, వసంత, కృష్ణకుమారి, ముత్యాలమ్మ, పుష్ప, కవిత, చంద్రకళ, బుజ్జిబాబు, పోతురాజు నాయుడు, సన్నీబాబు, వాసు, నారాయణ, బొంజుబాబు, కష్ణంరాజు, సోంద్రు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐ శంకరరావుకు సన్మానం

ఆర్ఐని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-అనంతగిరి:స్థానిక తహాశిల్దార్ కార్యాల యంలో ఆర్ఐ శంకరరావు బదిలీ కావడంతో శనివారం సిబ్బంది ఆయనకు సాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు. మండలంలోని వీఆర్వో గా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఆర్ఐగా గత 10 ఏళ్ల కాలంగా పనిచేశారు. ఆర్ఐ గా ప్రమోషన్ వచ్చిన అనంతరం అల్లూరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బదిలీ అయినప్పటికీ డిప్యూటేషన్ కింద అనంతగిరిలోనే విధులు నిర్వహిస్తు ప్రజలకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వీరభద్రచారి, ఉప తహసిల్దార్ మాణిక్యం, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరరావు ఆర్ఐ జగ్గయమ్మ, విఆర్ఒ లు ఎస్.రాంబాబు, కోటిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎం దంపతులకు సన్మానం

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గేదలబంద మోడల్ ప్రైమరీ స్కూల్ ల్లో విధులు నిర్వర్తిస్తూ గత నెల 31 న పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు యు రజిత, కేరి దంపతులకు ఎంఇఒ సుందరరావు, ప్రధానోపా ధ్యాయురాలు సరోజిని అధ్యక్షతన మండల కేంద్రంలోని ఎలిమెంటరీ స్కూల్లో మహిళా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ, నాగేంద్ర, కిరణ్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గున్నారు.

మాట్లాడుతున్న పల్లపు వెంకట్

సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- అడ్డతీగల : సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అంగన్వాడీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక మండల కేంద్రం ఆదివాసీ భవనంలో శనివారం ఉదయం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు రెండవ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్వాడీలకు అనేక హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో 10వేలు లోపు ఆదాయం వచ్చే వారికి అన్ని సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని చెప్పూనే రూ.7వేలు వేతనం వస్తున్న మినీ వర్కర్స్, హెల్పర్స్‌కు మాత్రం సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసినందుకు ప్రభుత్వ ఉద్యోగాలకు ఇచ్చే బెనిఫిట్స్ ఇవ్వాలని, లేదంటే అంగన్వాడీ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వెంకట్ డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కమిటీ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలుగా జి బేబీరాణి, కార్యదర్శిగా కె.లక్ష్మి, ట్రెజరర్‌గా జి.పార్వతి, కార్యదర్శివర్గం సభ్యులుగా జే.చంద్రకళ, బి.విజయ, నుకరత్నం. బి.వీరలక్ష్మి, జె.విశ్వమ్మ, మరో 24 కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే.శాంతిరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు పాల్పడితే ఆస్తులు జప్తు

ప్రజాశక్తి - సీలేరు : గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారు మళ్లీ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే పిఐటిఎన్‌డిపిఎస్ కేసులు నమోదు చేయడంతో పాటు సంపాదించిన ఆస్తులు జప్తు చేస్తామని జీకే వీధి సీఐ వరప్రసాద్ హెచ్చరించారు. జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో పాత గంజాయి నేరస్తులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. వారికి సీఐ వరప్రసాద్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇప్పటికైనా పాత నేరస్తులు గంజాయి అక్రమ రవాణాకి పాల్పడకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. అలా కాకుండా ఎవరైనా అతిక్రమించి గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలతో పాటు ఆస్తులు జప్తు చేసి స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్థాయీ సంఘం బరిలో 20 మంది

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికల బరిలో తుదకు 20 మంది అభ్యర్థులు నిలిచారు. గడువులోగా 21 నామినేషన్లు దాఖలుకాగా శనివారం మధ్యాహ్నానికి కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ నెల 6న స్థాయీ సంఘం ఎన్నికలు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించి, అదే రోజున ఫలితాలు ప్రకటిస్తామని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు.

బరిలో ఉన్న అభ్యర్థులు వీరే..

ఇమ్రాన్ మహమ్మద్, ఉరుకుటి రామచంద్రరావు, కరజాడ వెంకట నాగ శశికళ, కోడిగుడ్ల పూర్ణిమ, గేదెల (బంటుమిల్లి) లావణ్య, గంకల కవిత, గుండాపు నాగేశ్వరరావు, దాడి వెంకట రామేశ్వరరావు, నక్కెళ్ల లక్ష్మి, నీలిమ కొణతాల, పల్లా అప్పలకొండ, జె.బిపిన్ కుమార్ జైన్, మాదంశెట్టి చినతల్లి, మొల్లి ముత్యాలు, మొల్లి హేమలత, రాపర్తి త్రివేణి వరప్రసాదరావు, రెయ్యి వెంకటరమణ, రౌతు శ్రీనివాస్, సాడి పద్మావతి (పద్మ రెడ్డి), సేనాపతి వసంత స్థాయీ సంఘం బరిలో ఉన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

వేర్వేరు చోట్ల 632 కిలోల స్వాధీనం

ఎనిమిది మంది అరెస్టు

అనకాపల్లి జిల్లాలో వేర్వేరు చోట్ల నిర్వహించిన వరుస దాడుల్లో 632 కిలోల గంజాయి పట్టుబడింది. ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆయా కేసుల్లో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నిందితులతో కశింకోట పోలీసులు

ప్రజాశక్తి - కశింకోట : మండల కేంద్రంలోని సత్తెమ్మ తల్లి మలుపు వద్ద స్కార్పియోలో అక్రమంగా తరలుతున్న సుమారు రూ.52 లక్షలా 40 వేలు విలువచేసే 262 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. కేసు వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి ఎం.శ్రావణి మీడియాకు వివరించారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేశారు. ముగ్గురు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ వారిలో అల్లూరి జిల్లా నిట్టిపుట్ట గ్రామానికి చెందిన అనుగూరి కొండబాబు, బొడ్డిగొంది గ్రామానికి చెందిన అనుగూరి సోమేష్ కుమార్, అనకాపల్లి జిల్లా పైడంపేట గ్రామానికి చెందిన సిరికి రాఘవ, బండారు గణేష్ ఉన్నారు. వీరు గంజాయిని ఒడిశా నుంచి తమిళనాడుకు తరలిస్తున్నారు. నిందితుల నుంచి స్కార్పియో వాహనం, టివిఎస్ స్కూటీ, నాలుగు సెల్ ఫోన్లు, రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో సిఐ స్వామి నాయుడు, ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

కోటవురట్ల : మాకవరపాలెం మండల పరిసర ప్రాంతాల్లో 370 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. నలుగురిని అరెస్టు చేశారు. కేసు వివరాలను డిఎస్‌పి శ్రీనివాసరావు వెల్లడించారు. రెండు కార్లు, ఒక స్కూటీతో తరలుతున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.1.20 కోట్లు ఉంటుందని అన్నారు. అల్లూరి జిల్లా చింతపల్లి ప్రాంతం నుంచి రోలుగుంట మీదుగా మాకవరపాలెం వైపు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితులు నర్సీపట్నం, రోలుగుంట మండలాలకు చెందిన వారని తెలిపారు.

'ఉక్కు'ను ముంచేసేది.. మంచి ప్రభుత్వమా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'మంచి ప్రభుత్వం ఎప్పుడూ విధానమైనా, చట్టమైనా విస్తారమైన ప్రజాభిప్రాయానికి విలువ నిస్తుంది' - అని హెచ్ఆర్ హావీస్ అనే సామాజిక వేత్త నాడు చెప్పాడు. తమదీ మంచి ప్రభుత్వం అంటూ చంద్రబాబు నేతృత్వంలోని 'కూటమి' ప్రభుత్వం డాంబికాలు పలుకుతోంది. ఈ క్రమంలో 'విశాఖ ఉక్కు'ను ముంచేసే విధానాన్ని సమర్థిస్తూ వస్తోంది. స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి 100 శాతం వ్యూహాత్మక అమ్మకం లేదా ప్రైవేటీకరణ చేస్తామన్న నాలుగున్నరేళ్ల క్రితం మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికే కేంద్రం కట్టుబడి ఉందన్నది శుక్రవారం కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మ మాటలతో తేలిపోయింది. స్టీల్‌ప్లాంట్‌లోని అనేక విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగులను విఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపడం, కాంట్రాక్టు ఉద్యోగులపై వేటు వేయడం, పలు డిపార్టుమెంట్లలో కాంట్రాక్టీకరణను పెద్ద ఎత్తున యాజమాన్యం చేపట్టడం క్రమంగా పెరుగుతున్నాయి. వీటిని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిలువరించడం లేదు. గత ఎన్నికల్లో కూటమి పార్టీలకు పట్టం కట్టిన ఈ ప్రాంత ప్రజలు టిడిపి అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణ ఆగుతుందని ఆశించారు. కానీ బాబు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రైవేటీకరణ చర్యలకు మరింత వత్తాసు పలుకుతోంది.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి..

ఆంధ్రుల ఆత్మగౌరవానికి 'బ్రాండ్ ఇమేజ్' అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రంలోని బిజెపి పార్టీతో జత అయ్యి 'కూటమి' కట్టిన తెలుగుదేశం, జనసేన పార్టీలు విశాఖ ప్రజలకు తీవ్రద్రోహం తలపెడుతున్నాయి. 2024 ఎన్నికలకు ముందు, ఎన్నికల సందర్భంగా విశాఖ ఉక్కు కార్మికులకు, ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీని మరిచాయి. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో ఉంచేందుకు కృషి చేస్తామని, గెలిచాక అదే మొదటి అజెండా అంటూ నాడు నమ్మబలికి నేడు మోసగించారు. నేటికీ ఉక్కును పరిరక్షించాలన్న డిమాండ్ రాష్ట్ర మంతటా మార్మోగుతూనే ఉంది. కానీ కూటమి ఏడాది పాలనలో ఉక్కుపై చంద్రబాబు మౌనం దాల్చుతూ కేంద్ర మోడీ సర్కారు అడుగులకు మడుగులు ఒత్తుతూ వస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల తరపున హస్తినకు వెళ్లి సొంత గనులు, అనుమతుల కోసం చంద్రబాబు పైరవీలు చేస్తూ ఆర్సెలార్ మిట్టల్‌కు భజన చేయడం తప్ప ఈ కాలంలో చేసిందేమీ లేదు. టిడిపి సంగతి ఎలాగున్నా తాను మాత్రం స్టీల్‌ప్లాంట్‌ను రక్షించి తీరుతానంటూ ప్రగల్భాలు పలికిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ అసలు ఉక్కు ఫ్యాక్టరీ ఒకటి ఇక్కడ ఉందన్న సంగతినే మరిచినట్టు నటిస్తున్నారు.

దిగజారుతున్న ఉక్కు కార్మికుల జీవనం

ప్లాంట్‌లో కార్మికులకు రెగ్యులర్‌గా జీతాలను అందించే పరిస్థితి లేదు. ఏడాది కాలంగా పూర్తి నెల జీతం ఏనాడూ కార్మికులు అందుకోలేదంటే ఆశ్చర్యం కలగక మానదు. వారి ఆర్థిక పరిస్థితిని కావాలనే దిగజార్చే చర్యలకు యాజమాన్యం, కేంద్రం దిగాయి. వారిని చంద్రబాబుగానీ, విశాఖ ఎంపీ శ్రీభరత్‌గానీ, స్థానిక గాజువాక ఎంఎల్ఎ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుగానీ పట్టించుకున్న దాఖలాల్లేవు. వారు బుకాయింపు ప్రదర్శిస్తూ పబ్బం గడుపుకోవడం అలవాటుగా మార్చుకున్నారు. సమస్య పరిష్కారానికి రాజకీయ పార్టీలే ముందుకు రాకపోతే తమ భవిష్యత్తు ఏమిటనే ఆందోళనలో కార్మికులు, ఉక్కు నిర్వాసితులు ఉన్నారు. ఇప్పుడు కూటమి నేతలను చెప్పమనండి వారిది ముంచే ప్రభుత్వమా? మంచి ప్రభుత్వమా?!

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు

యువతకు ఉపాధి కల్పన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ ప్రక్రియలో ఉపాధి కల్పనకు దోహదపడే సంస్థలకు, వ్యవస్థలకు ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రభుత్వ విప్, విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు అన్నారు. శనివారం సాయంత్రం బీచ్ రోడ్ లోని అంబికా గ్రీన్ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువతకు ఉపయుక్తంగా నిలిచే నాలుగు శాఖలను ఆయన ప్రారంభించారు. వీటికి సంబంధించిన లోగో, పోస్టర్లను ఆవిష్కరించారు. యువతకు విద్య, ఉపాధిని అందించే విధంగా కృషి చేస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. ప్రభుత్వపరంగా అవసరమైన సహకారాన్ని అందిస్తామని చెప్పారు. యువతకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన ఉపాధి అవకాశాలను అందించే దిశగా కృషి చేస్తామని క్రూజ్ కాలినరీ అకాడమీ వ్యవస్థాపకులు టేకి ప్రభాకర్, అదిబ రూహి సయ్యద్‌లు తెలిపారు. దీనిలో భాగంగా తమ సంస్థ సీసీఏ ఆధ్వర్యంలో మేనేజ్మెంట్ విద్య అందించడం, గల్ఫ్‌లో ఉద్యోగాలు కల్పించే ఏజెన్సీ ప్రారంభోత్సవం, విదేశీ విద్యలో యువతకు అవగాహన సహకారం అందించడం, నౌకల్లో ఉద్యోగాలు అందించే విధంగా ఓషన్ రిక్రూట్ రిక్రూట్మెంట్ జరిపే నాలుగు విభాగాలను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నాజియా, ప్రిన్సిపాల్ బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నర్సింగ్ హోమ్ కియోస్క్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా లేడీస్ సర్కిల్ ఇండియా, ఆయుష్మాన్ ప్రాజెక్టు క్రింద కెజిహెచ్ గైనిక్ విభాగం నందు శనివారం తల్లి, నవజాత శిశువులకు ప్రాథమిక నర్సింగ్, ప్రసవానంతర సంరక్షణ కోసం పబ్లిక్ నర్సింగ్ హోమ్ కియోస్క్‌ను కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లేడీస్ సర్కిల్ ఇండియా చైర్ పర్సన్ జయశ్రీ హిరావత్, డాక్టర్ దీపతో పాటు కెజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.రాధాకృష్ణన్, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ యు.శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ బివి.రమణ, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ జి.సౌమిని, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో మ్యూటేషన్ పరిశీలన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కల్పించిన ఆటో మ్యూటేషన్ ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా సజావుగా జరపాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం ఆయన రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిఐజి జి.బాలకృష్ణ, జివిఎంసి డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, నాలుగో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడుతో కలసి పాత సూపర్ బజార్ ప్రాంగణంలోనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి స్వయంగా ఆటో మ్యూటేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వచ్చిన వారితో కమిషనర్ మాట్లాడుతూ వేటికి సంబంధించి రిజిస్టేషన్లు చేయించుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు.

అవినీతి సొమ్ము దాచుకోవడానికే బాబు సింగపూర్ పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అవినీతి సొమ్మును దాచుకునేందుకే సిఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ సింగపూర్‌లో పర్యటించారని మాజీ మంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో శనివారం మాట్లాడుతూ తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కంపెనీలు ఎపికి రాకుండా వైసిపి ఈ మెయిల్స్ రాస్తోందంటూ మంత్రి లోకేష్ మీడియా ముందు కట్టుకథలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు